క్లుప్తంగా

ఫారెస్ట్ భూముల్లో ఆక్రమణలు తొలగింపు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఎర్రబాలెం కొండ ప్రాంతంలోని ఫారెస్ట్ భూముల్లో ఆక్రమణలను గురువారం ఫారెస్ట్ అధికారులు తొలగించారు. గత కొంతకాలంగా ఎర్రబాలెం, పెనుమాక, ఉండవల్లి, నులకపేట, బ్రహ్మానందపురం, గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లోని ఫారెస్ట్ భూములను కొందరు ఆక్రమించుకుని చిన్న చిన్న గుడిసెలను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న మంగళగిరి ఫారెస్ట్ అధికారులు ఎర్రబాలెంలోని ఫారెస్ట్ భూముల్లోని ఆక్రమణలను తొలగించారు. కాగా మిగతా ప్రాంతాల్లో కూడా ఆక్రమణలు తొలగించి ఫారెస్ట్ భూములను అధికారులు స్వాధీనం చేసుకోవాల్సి ఉంది.

తాడేపల్లి ట్రాఫిక్ సీఐగా నరేష్ కుమార్



తాడేపల్లి రూరల్: తాడేపల్లి ట్రాఫిక్ సీఐగా డి.నరేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ గురువారం నరేష్ కుమార్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. సీఐ నరేష్ కుమార్ గతంలో తాడేపల్లి లా–ఆర్డర్ ఎస్ఐ, సీఐగా బాధ్యతలు నిర్వహించిన సంగతి విదితమే.

బాల వజ్రబాబు పరామర్శ



ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి తండ్రి రామచంద్రారెడ్డి గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు తక్కెళ్లపాడు గ్రామానికి వెళ్లి రామచంద్రారెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శివరామిరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, ఈశ్వరరెడ్డి, పాలపాటి రఘు, చేవూరి రామమోహన్‌రెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, పెరికల చిన్నా ఉన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

తాడికొండ: పీ–4 సర్వేలో గుర్తించి అర్హత కలిగిన బంగారు కుటుంబాల గ్రామ సభలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సమతావాణి ఒక ప్రకటనలో తెలిపారు. 18న ఉదయం ముక్కామల, మధ్యాహ్నం మోతడక, 19న లచ్చన్నగుడిపూడి, పాములపాడు, 21న ఫణిదరం, దామరపల్లి, 22న గరికపాడు, బండారుపల్లి, 23న పొన్నెకల్లు, లాం, 24న బేజాత్పురం, నిడుముక్కల, 25న కంతేరు, రావెల, 26న తాడికొండ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అర్హత కలిగిన కుటుంబాలను నోటీసు బోర్డులో పొందుపరచనున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎయిమ్స్‌లో అత్యాధునిక ల్యాబ్ ప్రారంభం

మంగళగిరి: రాష్ట్రంలోనే అత్యాధునిక ఆర్ట్ ఎస్ఐసీయూ పీఐసీయూ ల్యాబ్‌ను ఆల్ ఇండియా మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్)లో అందుబాటులోకి రావడం అభినందనీయమని ఎయిమ్స్ డైరెక్టర్ అహెంతమ్ శాంత సింగ్ తెలిపారు. గురువారం ఎయిమ్స్‌లో ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

యువతి అదృశ్యంపై కేసు

తాడికొండ: తుళ్లూరు మండలంలో యువతి అదృశ్యంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన 35 ఏళ్ల యువతి ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వారిని అడిగినా ఫలితం లేకపోవడంతో గురువారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆరోగ్య శిక్షణ కేంద్రం సందర్శన

తాడికొండ: గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.వి. సుందరాచారి గురువారం తాడికొండలోని గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన తాడికొండతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వసతులు, లోపాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలో అడుగడుగునా మోసం

- ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోర వైఫల్యం
- హామీలు అమలు చేయలేక జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు
- మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



మాట్లాడుతున్న మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో కూటమి పాలన అడుగడుగునా మోసం, దగాలకు పాల్పడుతుందని.. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్ని పక్కదారి పట్టిస్తున్నారని మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని 14వ వార్డులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేమారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబు మేనిఫెస్టో రీకాలింగ్ పేరుతో ఏ విధంగా మోసాలు చేస్తున్నారోనన్న కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందుకు అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయలేకపోతున్నారని ఆయన ఆరోపించారు. ప్రజల్ని పక్కదారి పట్టించేందుకు రాష్ట్రంలో ఎటువంటి అచారకాలు జరిగినా ఆ నిందలన్నీ మాజీ సీఎం వైఎస్ జగన్‌పైనే నెట్టి వేస్తూ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.

బాబు అబద్ధపు హామీలు..

ఇచ్చిన హామీలను ప్రజలు ఎక్కడ అమలు చేయమని నిలదీస్తారోననే భయంతో జగన్‌పై నిందలు వేస్తున్నారని విమర్శించారు. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ప్రచారం చేసేందుకు ఉమ్మడిగా వెళ్లి అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చే పథకాల కన్నా ఎక్కువ ఇస్తామని బాండ్లు ఇచ్చారన్నారు. ఆ బాండ్లలో ఉన్న పథకాలు మీ ఇంట్లో లేదా మీ సన్నిహితులకైనా అందుతున్నాయో లేదో ఒకసారి చూడాలన్నారు. మీకు తెలియకపోతే మేము ఇచ్చిన క్యూ ఆర్ కోడ్‌ను మీ సెల్‌ఫోన్‌లో స్కాన్ చేసి చూసుకుంటే బాబు ఇచ్చిన అబద్ధపు హామీలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు జీలగ పెదగాలయ్య, ప్రధాన కార్యదర్శులు చిన్నపోతుల దుర్గారావు, చిట్టిమళ్ల స్నేహసంధ్య, షేక్ సర్దార్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సింగా గంగాధర్, ఉపాధ్యక్షుడు ఈదులమూడి డేవిడ్‌రాజు, పట్టణ మైనార్టీ మహిళ, విద్యా విభాగాల అధ్యక్షులు షేక్ హుస్సేన్, దర్శి విజయశ్రీ, గోలి నరిసింహ, రాష్ట్ర, నియోజకవర్గ, పట్టణ విభాగాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న ప్రజలు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీపీఐ నాయకులు

తాడేపల్లి రూరల్: దేశంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థలను గుజరాత్ పెట్టుబడి దారులకు దోచిపెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. తాడేపల్లి పార్టీ కార్యాలయం (నీలం రాజశేఖర్ రెడ్డి భవన్)లో గురువారం సీపీఐ తాడేపల్లి ప్రాంత ద్వితీయ మహాసభ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సీపీఐ సీనియర్ నాయకులు గుంటక సాంబిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ.. గత మూడేళ్లల్లో చేపట్టిన అనేక ఉద్యమాల కార్యక్రమాలను సమీక్షించామని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతోందని ఆరోపించారు. గృహ వినియోగదారులకు బలవంతంగా స్మార్ట్ మీటర్లు అమర్చేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మెడ హనుమంతరావు, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి ముసునూరు సుహాస్, సీనియర్ నాయకులు గుంటక సాంబిరెడ్డి, మానికొండ డాంగే, మునగాల రామారావు, బత్తూరి మోహన్రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

సీపీఐ తాడేపల్లి ప్రాంత ద్వితీయ మహాసభ గురువారం నిర్వహించారు. ఈ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శిగా కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శులుగా తుడిమెల్ల వెంకటయ్య, ముసునూరు సుహాస్, కమిటీ సభ్యులుగా మానికొండ డాంగే, గుంటక సాంబిరెడ్డి, శీలం శ్యామ్, షేక్ బాషా, జి.శివ, గౌరీలు ఎన్నికయ్యారు.

ఆర్థిక సహాయం అందజేత



నసీమా కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన షేక్ నసీమాకు మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) మంజూరైంది. బాధితురాలి భర్తకు గురువారం టీడీపీ నాయకులు చెక్కు అందజేశారు. ఎల్‌వోసీ చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి లోకేష్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం, ఆరోగ్యం సంరక్షణకు పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రమ్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ ఇబ్రహీం, మైనార్టీ నాయకులు షేక్ నాగుల్ మీరా, సయ్యద్ ఖలీల్, షేక్ హుస్సేన్, షేక్ హుస్సేన్(కొత్తపేట) తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు



ప్రారంభోత్సవంలో స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్

మేడికొండూరు: ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్ అన్నారు. మండల పరిధిలోని సిరిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల సౌకర్యార్థం ఆర్వో వాటర్ ప్లాంట్, లైబ్రరీని సొంత ఖర్చులతో పూర్తిచేసి పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి కష్టపడి చదువుకోవాలన్నారు. ఎంచుకున్న రంగాల్లో రాణించాలని తెలిపారు. సిరిపురం స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ మాట్లాడుతూ.. పాఠశాల అవసరాల నిమిత్తం పాఠశాల అభివృద్ధికి ఆర్వో వాటర్ ప్లాంట్, లైబ్రరీని కోరిన వెంటనే అందజేసిన శ్రీవ్యాల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కడియాల గణేష్ బాబు, మరిపూడి రాంబాబు, కడియాల హనుమంతరావు, వడ్డంపూడి భాను ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు జేఎన్‌టీయూకే అనుమతి



జేఎన్‌టీయూకే వీసీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్న చలపతి యాజమాన్యం, అధ్యాపకులు

మోతడక(తాడికొండ): తాడికొండ మండలం మోతడక గ్రామంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు కాకినాడకు చెందిన జేఎన్‌టీయూకే అనుమతి లభించినట్లు చలపతి విద్యాసంస్థల కార్యదర్శి వై.సుజిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీఈ, సీఎస్ఈ విభాగాలలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశోధనా కేంద్రాల ఏర్పాటుతో విద్యార్థుల్లో కొత్త విషయాల ఆవిష్కరణ, సాంకేతిక అభివృద్ధి, నైపుణ్యాల అభివృద్ధి విజ్ఞానాన్ని పెంపొందించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా తమ కళాశాలకు పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూకే కాకినాడ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఇతర అధికారులకు కార్యదర్శి వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, డీన్లు డాక్టర్ పి.బాల మురళీ కృష్ణ, డాక్టర్ వీవీ సుబ్బారావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ఉద్యోగాలు అంటూ మోసం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్)లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.12 లక్షలకు మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నగర పరిధిలోని యర్రబాలెంకు చెందిన వేలంగణి రాజు అనే వ్యక్తి ఎయిమ్స్‌లో ఉద్యోగాలు ఉన్నాయంటూ పలువురు వద్ద రూ.12 లక్షలు వసూలు చేశాడు. నకిలీ అపాయింట్‌మెంట్లు సృష్టించి పలువురుని మోసం చేశాడు. దీంతో బాధితులు మంగళగిరి రూరల్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణ



దుగ్గిరాల: మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాలకు శిక్షణ ఇచ్చామని డీఆర్‌డీఏ పీడీ డైరెక్టర్ టి.వి.విజయలక్ష్మీ తెలిపారు. దుగ్గిరాల మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత నెలలో మంచికలపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన జ్యూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణ నేర్చుకున్న వారందరికీ ప్రశంసా పత్రాలు అందించామని అన్నారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, ఎంపీపీ షేక్ జబీన, యార్డు చైర్మన్ వి.ఝాన్సీరాణి, కె.శ్రీ అనిత తదితరులు పాల్గొన్నారు.

21న డిగ్రీ కళాశాలల బంద్!

తాడేపల్లి రూరల్: ఈనెల 21వ తేదీన డిగ్రీ కళాశాలలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీపీ డీసీఎంఏ పిలుపు మేరకు డిగ్రీ కళాశాలలు బంద్ నిర్వహిస్తున్నట్లుగా ప్రయివేట్ కళాశాల యాజమాన్యం అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, నాగార్జున యూనివర్సిటీ యాజమాన్యం సంగం గౌరవాధ్యక్షులు వీవీ ప్రసాద్ గురువారం తెలిపారు. డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని.. ప్రొఫెసర్ వెంకయ్య కమిటీ సిఫార్సులు మేరకు 2 మేజర్ అమలు చేయాలని.. కొత్త కోర్సులకు అనుమతి మంజూరు.. ప్రస్తుత కోర్సుల మార్పునకు అనుమతి వంటి డిమాండ్స్‌తో డిగ్రీ కళాశాల బంద్ నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఈ సమస్యలపై విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులతో 5 నెలలుగా అనేక పర్యాయములు విన్నపాలు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేకపోవడంతో బంద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.


విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

దుగ్గిరాల: ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతకానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరుకలపూడి గ్రామానికి చెందిన చిమట సాయికృష్ణ(25) వ్యవసాయ మోటారు రిపేరు చేయడానికి వెళ్లారు. ఈ సందర్భంలో సాయికృష్ణకు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అదించారు.

226వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: న్యాయపరంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 226వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ దీక్షలో కె.ఆదినారాయణ, వై.సాంబయ్య, డి.నాగేశ్వరావు కూర్చున్నారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ.. సిమెంట్ కంపెనీ కార్మికుల పోరాటానికి అన్ని కార్మిక సంఘాలు మద్దతు ఇస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎం.గురవయ్య, ఎస్‌కే సుభాని, షేక్ ఆరీఫ్, ఆశీర్వాదం, నాగేశ్వరరావు, దుర్గా భవాని, శారమ్మ, శారద, హిమాంబి, వేముల లక్ష్మి, దేరంగుల రమణ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌గా కేశవరావు



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన తడవర్తి కేశవరావు నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వ నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని జనసేన పార్టీకి చెందిన కేశవరావుకు కేటాయించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నియామక ఉత్తర్వులు విడుదల అయ్యాయి. ప్రస్తుతం కేశవరావు యర్రగుంట్లపాడు గ్రామ సర్పంచిగా పనిచేస్తున్నారు. జనసేన పార్టీ తరఫున ఆయన గెలుపొందారు. కేశవరావుకు చైర్మన్ పదవి రావడంతో పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.



తాడికొండ: తాడికొండ వ్యవసాయం మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్‌గా ముక్కామల గ్రామానికి చెందిన నేలాల ధనలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ధనలక్ష్మి భర్త నేరాల కష్టారావు గత ఎంపీటీసీ ఎన్నికల్లో ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన వీరికి ఈ పర్యాయం పదవి కేటాయించారు.

మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలి

జీవో ప్రకారం జీతాలు పెంచకుంటే పోరాటం ఉధృతం

తాడేపల్లి రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొలనుకొండ జాతీయ రహదారి వద్ద గురువారం మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ కమిషనర్ రాష్ట్ర కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జీవో నంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలని పెద్ద ఎత్తున కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అనేక ఆందోళనలు, ప్రదర్శనలు, ధర్నాలు చేసినప్పటికీ ముఖ్యమంత్రి, సంబంధిత మున్సిపల్ శాఖ మంత్రి, మున్సిపల్ కార్మికుల సమస్యను పట్టించుకోలేదని మండిపడ్డారు. జీవో ప్రకారం జీతాలు ఇవ్వకుంటే న్యాయమైన పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం రాష్ట్ర కన్వీనర్ బి.ముత్యాలరావు, కోకన్వీనర్ ఎస్.జ్యోతిబస్, నాయకులు జాన్ బాబు, కె.శ్రీనివాసరావు, షేక్ సిలర్, పూనే పల్లి శ్రీనివాసరావు, నాగేంద్ర, ఏటీఎం నాగరాజు, ఆర్.వేణు, వెంకట్రావ్, మల్లిఖార్జున రావు, సుబ్బారాయుడు, ఎస్.బాబురావు, తాడేపల్లి పట్టణ నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, రాజధాని నాయకులు ఎం.రవి, మంగళగిరి నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లెకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

డిగ్రీ అడ్మిషన్ షెడ్యూల్ విడుదల చేయాలి



ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాలు

తాడేపల్లి రూరల్: డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, పీడీఎస్‌వో సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ధర్నా పిలుపునివ్వడంతో ప్రభుత్వం దిగొచ్చి అర్ధరాత్రి డిగ్రీ అడ్మిషన్ల జీవోను విడుదల చేసింది. జీవో విడుదల చేసిన ప్రవేశాలకు షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని విద్యార్థి సంఘాలు ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలు పూర్తయ్యి 3 నెలలు గడుస్తున్నా డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ మొదలు కాలేదని అన్నారు. ప్రవేశాల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికే డిగ్రీ చేరాలనుకునే విద్యార్థులకు నష్టం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి మాట్లాడుతూ.. షెడ్యూల్ వీలైనంత త్వరగా ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కిరణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రఫీ, పీడీఎస్‌వో రాష్ట్ర నాయకురాలు భాను, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగ భూషణం పాల్గొన్నారు.

సామాజిక రక్షణ చర్యలపై సమావేశం



ప్రజలతో మాట్లాడుతున్న సీఆర్డీయే అధికారులు

తాడికొండ: అమరావతి నిర్మాణ పనుల్లో అమలవుతున్న పర్యావరణ–సామాజిక రక్షణ చర్యలు గురించి జూలై 15 నుంచి 17వ తేదీ వరకు వరుసగా 3 రోజులపాటు ఏపీ సీఆర్డీయే ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించింది. పలు గ్రామాల్లో జరిగిన ఈ సమావేశాల్లో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఆర్డీయే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సామాజిక సంక్షేమ విభాగం, సామాజిక–పర్యావరణ, సిబ్బంది ఆధ్వర్యంలో ఈ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని నిర్మాణంలో పాటిస్తున్న భద్రతా నిబంధనలు, పర్యావరణ పరిరక్షణ, మహిళా కార్మికుల సంక్షేమం, వలస కార్మికుల భద్రతకు చేపట్టిన చర్యలను అధికారులు వివరించారు. సమావేశాలకు హాజరైన వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు సీఆర్డీయే అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్ పంపిణీ



డ్రోన్‌ను అందిస్తున్న విజయ్‌బాబు

దుగ్గిరాల: రైతులు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో వ్యవసాయ రసాయన మందులను పిచికారీ చేసేందుకు డ్రోన్ ఉపయోగ పడుతోందని ఏవో ఆర్.విజయ్‌బాబు తెలిపారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని మాట్లాడారు. సీహెచ్‌సీ గ్రూపునకు కిసాన్ పథకం ద్వారా 80 శాతం సబ్సిడీపై డ్రోన్‌ను అదించారు. ఈ డ్రోన్ ద్వారా రైతులకు ఉపాధి లభిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ జబీన్, గ్రామ సర్పంచ్ మాణిక్యం, యూనియన్ బ్యాంకు మేనేజర్, రైతులు పాల్గొన్నారు. తుమ్మపూడి గ్రామంలో వరి సాగుకు కృష్ణా పశ్చిమ డెల్టా కెనాల్‌కు సాగు నీటిని గురువారం విడుదల చేశారు. వరి పైరును వెద పద్ధతిలో సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎ.నాగమల్లేశ్వరరావు రైతులకు సూచించారు.